ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 12 | జూన్ | 2024
పేజీలు 7

## సెలవులకు ఇక టాటా...



**నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం**

-ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల తిష్ట
-ప్రైవేటులో ఫీజుల మోత

2లో

# తలాపునే గోదారి..
# భూ తనువు తడపలే..!



-అటకెక్కిన దుమ్ముగూడెం
-సా...గుతున్న సీతారామ
-రేపు మంత్రుల పరిశీలన

## దశాబ్దాలుగా రైతుల ఎదురుచూపు

తలాపునే జీవనది గోదావరి ప్రవహిస్తుంది. కాని భూతల్లి తనువు తడపకుండానే వందలాది టిఎంసిల నీరు సముద్రం పాలవుతుంది. గోదారి నీళ్ల ఉమ్మడి ఖమ్మంజిల్లా భూములు తడపాలని, ప్రాజెక్టులు నిర్మించాలని అనేక దశాబ్దాలుగా పోరాటాలు సాగాయి. ఎట్టకేలకు ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిన ఉమ్మడి రాష్ట్రంలో అది ముందుకు సాగలేదు. కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ఎకరాకు సాగునీటిని అందించిన దాఖలాలు లేవు.

-ప్రజాపక్షం/ఖమ్మం

2లో

## నేడు జిల్లాలో ముగ్గురు మంత్రుల పర్యటన





## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా



-అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూద్దాం
-కొందరు పాలనపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు
-మానుకుంటే మంచిది : ఎంఎల్ఏ కూనంనేని

వివరాలు 2లో..



# తలాపునే గోదారి.. భూ తనువు తడపలే..!

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తలాపునే జీవనది గోదావరి ప్రవహిస్తుంది. కాని భూతల్లి తనువు తడపకుండానే వందలాది టిఎంసిల నీరు సముద్రం పాలవుతుంది. గోదారి నీళ్లు ఉమ్మడి ఖమ్మంజిల్లా భూములు తడపాలని, ప్రాజెక్టులు నిర్మించాలని అనేక దశాబ్దాలుగా పోరాటాలు సాగాయి. ఎట్టకేలకు ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిన ఉమ్మడి రాష్ట్రంలో అది ముందుకు సాగలేదు. కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ఎకరాకు సాగునీటిని అందించిన దాఖలాలు లేవు. పరిస్థితులు మారాయి. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించింది. అప్పటి పాలకులు తప్పు చేశారు ఇప్పుడు మేము త్వరితగతిన గోదారి నీళ్లను ఉమ్మడి ఖమ్మంజిల్లా భూముల్లో పారించి రైతుల మోములో నవ్వులు పుయిస్తామంటూ సీతారామ పేరుతో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. మూడేళ్లలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు దాదాపు ఎనిమిదేళ్లు గడిచినా ముందుకు సాగలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు జిల్లాకు చెందిన మల్లు భట్టివిక్రమార్క ఉప ముఖ్యమంత్రిగా, వ్యవసాయ శాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొనసాగుతున్నారు. వీరి హయాంలోనైనా గోదారి నీళ్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా భూములకు అందుతాయని ఆశిస్తున్నారు. ఇదే క్రమంలో సాగర్ కాలువకు గోదారి నీళ్లను అనుసంధానం చేయాలన్న ప్రయత్నం శీఘ్రగతిన సఫలీకృతం కావాలని రైతులు కోరుతున్నారు.

**గోదారి నీళ్ల కోసం దశాబ్దాల పోరాటం...**

రాష్ట్ర విభజనకు ముందు ఉమ్మడి ఖమ్మంజిల్లాలో గోదావరి 180 కిలో మీటర్ల మేర ప్రవహించేది. అప్పట్లో అధికారుల అంచనా ప్రకారం 700 టిఎంసిల నీరు గోదావరి నుంచి సముద్రంలో కలిసి పోతుందని అంచనా వేశారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ద్వారా ఖమ్మంజిల్లాలోని ఒక ప్రాంతానికే నీరు అందడం, అది కూడా సరిగా అందక పోవడం అందరికీ తెలిసిందే. కృష్ణానది ఎగువ భాగంలో కర్ణాటక, మహారాష్ట్ర ప్రాజెక్టులు నిర్మించడంతో నాగార్జున సాగర్ ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారిన వేళ గోదారి నీళ్లపై దృష్టి సారించాల్సి వచ్చింది. భారత కమ్యూనిస్టు పార్టీ తొలిసారిగా గోదావరి పై దుమ్ముగూడెం పై ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి సాగునీటిని అందించాలని ఆందోళనకు శ్రీకారం చుట్టింది. నల్లమల గిరిప్రసాద్, పువ్వాడ నాగేశ్వరరావు, రజబ్ అలీ నేతృత్వంలో అప్పట్లో పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. ఆ తర్వాత కూనంనేని సాంబశివరావు జిల్లా కార్యదర్శిగా ఉన్నప్పుడు దుమ్ముగూడెం సాధన కోసం జిల్లా దిగ్బంధనం లాంటి అనేక కార్యక్రమాలతోపాటు అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ఇంటి ముట్టడి కార్యక్రమం కూడా నిర్వహించారు. సిపిఎం సహా జిల్లాలో మిగిలిన రాజకీయ పార్టీలు సైతం వివిధ రూపాల్లో గోదావరి నీళ్ల కోసం పోరాటాలు నిర్వహించాయి. ఈ క్రమంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత వామపక్షాలతో పాటు ఇతర పార్టీల నుంచి వస్తున్న ఒత్తిడి కారణంగా గోదావరి జలాలను అందించాలనే లక్ష్యంతో రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ పేర్లతో గోదావరి పై రెండు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. దుమ్ముగూడెం రాజీవ్ సాగర్ పేరుతో అశ్వాపురం మండలంలో గోదావరి పైన ఎత్తిపోతల నిర్మాణానికి అప్పటి వేలేరుపాడు మండలం రుద్రమ్మకోట వద్ద ఇందిరా సాగర్ పేరుతో శంకుస్థాపన చేశారు. ఇందిరా సాగర్‌కు రూ. 1200 కోట్లు, రాజీవ్ సాగర్‌కు రూ.1800 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రాథమిక సమాచారం. కాని ఇన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ప్రాజెక్టుల ద్వారా దశాబ్ద కాలం గడిచినా సాగునీటిని అందించలేకపోయారు. కోట్ల రూపాయలు కాంట్రాక్టర్లు, కమిషన్ల పాలయ్యాయి తప్ప ఫలితం దక్కలేదు.

**రాష్ట్ర విభజనతో ప్రాజెక్టులలో మార్పు...**

సుదీర్ఘ పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత గోదావరి ప్రాజెక్టుల నిర్మాణ డిమాండ్ మరోసారి తెరపైకి వచ్చింది. 2016 ఫిబ్రవరి 16న అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసిఆర్ సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని సాగు భూములతో పాటు ఇప్పటి మహబూబాబాద్ జిల్లాలోని మూడు మండలాలకు సాగునీటిని అందించేవిధంగా ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తున్నట్లు ప్రకటించారు. నూతన ఆయకట్టుతో పాటు పాత ఆయకట్టు స్థిరీకరణ ద్వారా ఏడు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని 70 టిఎంసిల నీటిని ఎత్తిపోయాలని ప్రాజెక్టును డిజైన్ చేశారు. 2016 నుంచి 2023 వరకు ఈ ప్రాజెక్టు పనులు నత్త నడకను తలపింపజేశాయి. హెలికాప్టర్లలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలన చేయడం తప్ప నిధుల కేటాయింపు, పనులలో వేగం జరగ లేదు. అంతే కాకుండా తొలుత రూ.8వేల కోట్ల నుంచి బడ్జెట్‌ను రూ.13వేల కోట్లకు పెంచారు. ఆ తర్వాత రూ. 15వేల కోట్లకు పెరిగినట్లు సమాచారం. ఇప్పుడు రూ. 18,900 కోట్లు ఖర్చు కానున్నట్లు తెలుస్తుంది.

**ఇప్పుడైనా రైతాంగం కల నెరవేరేనా..?**

గోదావరి నీళ్లను సాగునీరుగా చూడాలని ఉమ్మడి ఖమ్మంజిల్లా రైతాంగం అనేక దశాబ్దాలుగా ఎదురు చూస్తుంది. ఉమ్మడి రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు నిర్మాణం పూర్తి చేసుకున్న గోదావరిపై ఎత్తిపోతల పథకం మాత్రం పూర్తి కాలేదు. గోదావరి నీళ్లను సాగునీటిగా అందించాలని ఒక రైతుగా తపించిన ప్రస్తుత వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతల్లో ఉండడం దుమ్ముగూడెం రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ గురించి విపక్ష నేతగా పలుమార్లు ప్రస్తావించి గోదావరి నీళ్లతోనే ఉమ్మడి ఖమ్మంజిల్లా సాగునీటికి శాశ్వత పరిష్కారమని చెప్పిన భట్టివిక్రమార్క ఉప ముఖ్యమంత్రిగా, ఆర్థిక మంత్రిగా ఉండడం ఖమ్మం జిల్లా అభివృద్ధిపై అవగాహన కలిగి రైతు కుటుంబం నుంచి వచ్చిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూ మంత్రిగా ఉండడంతో ఈ దఫా రైతుల ఆశలు రెట్టింపయ్యాయి. రైతాంగ ఆశలకు అనుగుణంగానే సీతారామ పై తరచూ మంత్రులు సమీక్ష చేస్తూ పనుల పురోగతిని పరిశీలిస్తున్నారు. కాని నిధుల కేటాయింపులో వెలితి ఈ ప్రాజెక్టు పూర్తి పై అనుమానాలను రెకేతిస్తుంది. ఇక గోదావరి నీళ్లను నాగార్జున సాగర్ ఎడమ కాలువకు ఏన్కూరు మండంలో అనుసంధానం చేయడం ద్వారా అటు సాగర్ ఆయకట్టు రెండవ, మూడవ జోన్లకు నీరందించడం జిల్లాలోనే అతిపెద్ద మధ్యతరహా ప్రాజెక్టుగాఉన్న వైరా ప్రాజెక్టు ఆయకట్టును గోదావరి జలాలతో స్థిరీకరించేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. ఆర్థిక మంత్రిగా సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని ఖమ్మంజిల్లా రైతాంగం భట్టి విక్రమార్కను కోరుతున్నది. ఈనెల 13న జిల్లా మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీతారామ ప్రాజెక్టు ను పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించనున్నారు. ఈ ఏడాది వ్యవసాయ సీజన్‌కు సాగునీరు అందక పోయినా వచ్చే ఏడాది కైనా సాగునీటిని అందించేందుకు కృషి జరగాలని ఖమ్మం జిల్లా రైతాంగం కోరుతుంది.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాతో అధికారులంతా కలికట్టుగా పనిచేయాలని కొత్తగూడెం ఎంఎల్‌ఏ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. గత పాలకుల ఏదో చోస్తున్నట్లు గొప్పలు చెప్పుకున్నారని, మారుగ్రామాలు అభివృద్ధికి నోచుకోకుండానే ఉన్నాయని చెప్పారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు అధికారుల చుట్టూ తిరిగినప్పటికీ అప్పటి నాయకుల మితిమీరిన జోక్యంతో అర్హులకు కూడా అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో డైయాల్సిస్ చేయించుకునే వారు ఉన్నారని, కొద్దిపాటి డయాల్సిస్ యంత్రాలతో రోగులు ఇబ్బందులు ఎదు ర్కుంటుంటే ప్రభుత్వంతో మాట్లాడి, ఒప్పించి పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి డయాల్సిస్ యంత్రాలు వచ్చేలా చేశామని చెప్పారు. గత ప్రభుత్వం పేదలకు ఇండ్లు కట్టించకుండా డబలు బెడ్ రూం ఇళ్లు పేరుతో కాలయాపన చేసిందని, అవి కూడా ఆ పార్టీకి చెందిన వారి చేతుల్లోనే ఉన్నాయని, లక్షల రూపాయలకు ఇళ్లను అమ్ముకున్నారని చెప్పారు. నియోజకర్గ వ్యాప్యంగా పేదలకు సరైన ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా అర్హులైన ప్రతీ పేదవారికి పథకం వర్తించేలా అధికారులు చొరవచూపాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా పరిశుభ్రమైన తాగునీటిని అందించి ప్రజలురోగాల భారిన పడకుండా చూచూడాలని, వానా కాలంలో ప్రజలు సీజనల్ వ్యాధులు భారిన పడే ప్రమాదం ఉందని, వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉంటూ మారుమూల గ్రామాల్లో ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధుల నివారణకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులకు క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కొందరు కావాలని ప్రభుత్వ పాలనపై బురద జల్లె కార్యక్రమాన్ని పనిగా పెట్టుకున్నారని, ప్రకృతి విపత్తులు మూలంగా ఇబ్బందులు తలెత్తితే దానిని ప్రభుత్వం తప్పిదంగా చిత్రీకరించడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా గాలివాన భీభత్సానికి చెట్లు విరిగి పడి విద్యుత్ అంతరాయం ఏర్పడితే అధికారులు రేయిపగలు కష్టపనిచేసి విద్యుత్‌ను పునరుద్దరించారని, బురదజల్లె పని పెట్టుకున్న వారు చౌకబారు మాటలు మానుకోవాలని హితవు పలికారు. పింఛన్ల కోసం దరఖాస్తులు వచ్చాయని వాటిని అధికారులు పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలన్నారు. పాఠశాలలు ప్రారంభం అవుతున్నందున విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందించాలని చెప్పారు. వానా కాలం పంటల సీజన్ ప్రారంభమైందని, రైతులు నకిలీ విత్తనాలు భారిన పడకుండా వ్యవసాయాధికారులు చర్యు తీసుకోవాలన్నారు. కొత్తగూడె ం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రధాంగా చేతకొండ, రేగళ్ల, పాల్వంచ లలో వేల ఎకరాల భూముల ఆన్‌లైన్ ప్రక్రియలో సమస్యలు వస్తునట్లు తమ దృష్టిలో ఉందని పరిష్కరిద్దామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన ప్రకారం ఆగస్టు 15వ తేది నాటికి రైతులందరికీ రుణమాఫీ చేయబోతున్నారని, దానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కూనంనేని సూచించారు.

## కలెక్టరేట్ ఎదుట వంట కార్మికుల ధర్నా

**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** భద్రాద్రి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటియుసి ఆధ్వర్యంలో వంట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పాఠశాలలో పనిచేస్తున్న వంట కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కనీసం రూ.10వేలు వేతనం ఇస్తామన్న హామీ అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం వంట కార్మికులకు నిత్యవసర సరుకులు, కోడి గుడ్లు, సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అల్పాహారం, స్నాక్స్, వండిన పనికి పారితోషికం అందించాలని, ఇన్సూరెన్స్, హెల్త్‌కార్డు, యూనిఫామ్ అమలు చేయాలని వంట కార్మిక సంఘ జిల్లా ప్రధాన




కార్యదర్శి విజయలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మంగ, ప్రభావతి, ముత్యాలు, రమణ, కె.అరుణ, ఎం.పద్మ, క్రాంతి, సరళ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లాలో ముగ్గురు మంత్రుల పర్యటన

**ప్రజాపక్షం/ ఖమ్మం :** జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు బుధ, గురు వారాల్లో ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు లు పర్యటించనున్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క 12వ తేదీన ఉదయం 10 గంటలకు ఎన్నెస్పి క్యాంపులోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీతో తమ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత కలెక్టరేట్‌లో మంత్రులు వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించనున్నారు. భట్టివిక్రమార్క మధిర నియోజక వర్గంలో పలు అభివృద్ధి పనుల్లో పాల్గొంటారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం ఖమ్మం, పాలేరు నియోజక వర్గాల్లో పర్యటించడంతో పాటు కలెక్టరేట్‌లో జరిగే సమీక్షా కార్యక్రమంలో పాల్గొంటారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని కలెక్టరేట్‌లో జరిగే సమీక్షలో పాల్గొనున్నారు. ముగ్గురు మంత్రులు గురువారం సీతారామ ప్రాజెక్టును సందర్శించి అధికారులతో పనుల పురోగతిపై సమీక్షించనున్నారు.

## సెలవులకు ఇక టాటా...



**ప్రజాపక్షం/ ఖమ్మం :** సుదీర్ఘ సెలవులకు విద్యార్థులు టాటా చెప్పక తప్పని స్థితి. దాదాపు 45 రోజుల పాటు సెలవులతో ఆట పాటలతో గడిపిన విద్యార్థులు నేటి నుంచి బడిబాట పట్టనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం యూనిఫాం తో పాటు పుస్తకాలను అందించనుంది. ఇక ఎప్పటి లాగానే ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు తిష్ట వేశాయి. బోధనా సిబ్బంది కొరత ప్రభుత్వ పాఠశాలలను వేధిస్తున్నది. మౌలిక వసతుల కల్పనలోను పురోగతి కనిపించడం లేదు. అసలే పతనావస్థ అంచున ఉన్న ప్రభుత్వ విద్యకు పునర్జీవం పోసేవిధంగా ప్రభుత్వం కృషి జరపాల్సి ఉంది. ఇక ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల మోత మోగిపోతుంది. ప్రభుత్వం ఫీజులపై ఎటువంటి నిబంధనలు తీసుకు రాకపోవడంతో యజమాన్యాల స్వయం ప్రకటిత ఫీజులే అమలవుతున్నాయి. ప్రభుత్వ బడికి పంపలేక, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. తల్లిదండ్రుల ఇబ్బందులు ఎలా ఉన్నా విద్యార్థులు మాత్రం బడిబాట పడుతున్నారు

# బడిబాటను పకడ్బందీగా నిర్వహించండి



## జిల్లా కలెక్టర్ విపి గౌతమ్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పెద్ద ఎత్తున విద్యార్థులను చేర్పించాలని, బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నూతన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బడిబాట, అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పూర్తి పై విద్యా శాఖ, ఇంజనీరింగ్, మండల సమాఖ్యలతో జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన బడిబాట కార్యక్రమాన్ని పక్కగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి బడిఈడు పిల్లలను గుర్తించి వారి వివరాలను సేకరించాలన్నారు. గుర్తించిన పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా కృషి చేయాలని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాల కల్పన, ఇంగ్లీష్ మీడియం బోధనపై అవగాహన కల్పించి వారిలో చైతన్యం తేవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుకుని అప్‌గ్రేడ్ అవుతున్న ఐదు నుంచి ఆరేండ్ల వయసు ఉన్న చిన్నారులందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ, విద్యా బోధన పై విద్యా శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్, మరుగు దొడ్లు, మిగిలిన నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. వారం లోగా పనులన్ని పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. మహిళా సంఘాలే పనులు చేపట్టాలని నిధుల మంజూరు విషయంలో ఎలాంటి జాప్యం జరగకూడదని కలెక్టర్ తెలిపారు. 12వ తేదీ వరకు పాఠ్యపుస్తకాలను అందించడంతో పాటు యూనిఫామ్స్ విద్యాశాఖాధికారులు సిద్ధం చేసి ఉంచాలని తెలిపారు. పాఠశాలల్లో శానిటేషన్‌కు సంబంధించిన పనులు చేపట్టాలని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సంబంధించి అన్ని వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువ ఉన్న చోట పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సైతం మరింత బలోపేతం చేయాలన్నారు. పాఠశాలల పునః ప్రారంభం రోజున అరటి, మామిడి ఆకులతో అలంకరణ చేయాలని పండుగ వాతావరణం స్ఫూరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల ప్రవేశం ఆవరణలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని వసతులతో అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ, జెడ్పి సిఈవో ఎస్. వినోద్, డిఆర్‌డివో సన్యాసయ్య, డిఐఈవో రవిబాబు, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి, బిసి వెల్ఫేర్ అధికారి జ్యోతి, ట్రైబల్ వెల్ఫేర్ డిడి విజయలక్ష్మి , పంచాయితీరాజ్, మున్సిపల్, ఆర్అండ్‌బి ఈఈలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించండి



## -దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి
## -ఏఐటియుసి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రామ పంచాయితీ సిబ్బంది పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఏఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ విపి గౌతమ్‌కు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ, గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయితీల్లో కార్మికులుగా పనిచేస్తున్న వారికి వేతనాలు సరిగ్గా రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యం ప్రజల కోసం పనిచేస్తున్న కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు. పెండింగ్ వేతనాలను చెల్లించడంతో పాటు పంచాయితీ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. స్పందించిన కలెక్టర్ పెండింగ్ వేతనాలను మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో పాటు దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తామని తెలిపినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె ఛానల్, మంగీలాల్, రాజగోపాల్, లింగయ్య, సీతారాములు, రేణుక, విజయలక్ష్మి , కోటేశ్వరరావు, రాజు, లలితమ్మ, శ్రీను, సైదులు, వీరన్న, సాంబ తదితరులు పాల్గొన్నారు.

# ఏఈఓలపై సస్పెన్షన్‌ను ఎత్తివేయండి




**ప్రజాపక్షం/కల్లూరుః** వ్యవసాయ విస్తరణ అధికారులపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ కల్లూరు మండలం కొర్లగూడెం రైతు వేదిక వద్ద సత్తుపల్లి డివిజన్ ఏఈవోలు నిరసన కార్యక్రమం చేపట్టి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఏడిఏ నరసింహారావుకు వినతిపత్రం అందించారు. మహబూబాద్ జిల్లా లో జీలుగు విత్తనాలు పంపిణీలో అక్రమాలు జరిగాయని ముగ్గురు ఏఈఓ లను అకారణంగా సస్పెండ్ చేసిన కారణంగా మంగళవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి డివిజన్ ఏఈవోలు కొర్లగూడెం రైతు వేదికలో నిరసన వ్యక్తం చేశారు. సస్పెన్షన్ పై సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఈఓల పై ఉన్న సస్పెన్షన్ను ఎత్తివేయాలని వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధుల్లోకి తీసుకొనిచో రాష్ట్రవ్యాప్తంగా దశల వారి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ల జిల్లా అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా, నరేష్ ,దీపక్ రెడ్డి ,నరేష్, వెంకటేష్, ఆశా జ్యోతి, ప్రేమ హర్ష, నందిని , నాగేశ్వరరావు నాగరాజు, సత్తుపల్లి డివిజన్ వ్యవసాయ విస్తరణ అధికారులు కల్లూరు, సత్తుపల్లి, తల్లాడ, వేంసూరు ,పెనుబల్లి మండలాలకు చెందిన ఏఈఓ లు పాల్గొన్నారు.

# డివిజనల్ స్థాయి క్రికెట్ పోటీలను విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఖమ్మం డివిజనల్ స్థాయి క్రికెట్ పోటీలను విజయవంతం చేయాలని నిర్వహకులు గట్టిగుండ్ల విజయ్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో ఆయన మాట్లాడారు...మండలం లోని నాచేపల్లి యువజన సంఘం ఆధ్వర్యంలో డివిజనల్ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో యువతలో దాగి ఉన్న క్రీడా స్ఫూర్తి ని వెలికితీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 13 న నాచేపల్లి లో క్రికెట్ పోటీలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.22,222, (ముత్తినేని వీరయ్య), రెండవ బహుమతి రూ.15,555 (ముంద్రా నాగప్రసాద్), మూడో బహుమతి రూ.11,111(అమ్మ చారిటబుల్ ట్రస్టు) నాల్గోవ బహుమతి రూ.5,555, (కాలపంగు బాబురావు) , బెస్ట్ బ్యాట్స్ మన్ రూ.1000, (జీ.విజయ్), బెస్ట్ బౌలర్ రూ.1000( బండి రామారావు) లు అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 9505133745, 9347605971 నెంబర్ల ను సంప్రదించాలని కోరారు.

# పాఠశాల భవన నిర్మాణాలకు చర్యలు తీసుకోండి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ విపి గౌతమ్ ఖమ్మం నగరంలోని రమణ గుట్ట రజకవీధి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అద్దె ఇంట్లో వసతుల లేమితో నిర్వహిస్తున్న పాఠశాలలకు వెంటనే స్థల గుర్తింపు చేసి భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. రెవెన్యూ అధికారులతో సర్వే చేపట్టి తదుపరి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఈవో సోమశేఖర శర్మ, ఖమ్మం అర్బన్ మండల విద్యాధికారి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దాతలకు ధన్యవాదములు



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు లోని కొత్త బస్టాండ్ లో గత 70 రోజులుగా ప్రయాణికులకు ఆర్టీసీ బస్టాండ్ లో మజ్జిగ ప్యాకెట్లను అందజేస్తున్న దాతలకు ప్రత్యేక కార్యక్రమంలో ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ముగింపు సభలో రూరల్ సీఐ వెంకటేష్ మాట్లాడుతూ సత్తుపల్లి ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో కల్లూరు లోని కొత్త బస్టాండ్ లో ప్రతిరోజు వివాహ, జన్మదిన శుభాకాంక్షలు, వర్ధంతిలు, సందర్భంగా కూలింగ్, మినరల్ వాటర్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగప్యాకెట్లు, రోజువారీగా దాతలను ఎంపిక చేసి ప్రయాణికులకు అందించడంలో ప్రణాళిక చేపట్టిన కిన్నెర ఆనందరావుకు, అదే విధంగా ప్రతి రోజు మినరల్ వాటర్ అందించిన ఆళ్లకుంట నరసింహారావుకు ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా వారిని సత్కరిస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కృష్ణారావు, ఎల్డీసీ శామ్యూల్, ధారా రంగా, ఉస్మాన్, శ్రీనాథ్, దామాల సురేష్, కాంతారావు, నరసింహారావు, నగేష్, రాజు, ఆర్ఎంపీ వైద్యులు, గ్రామ ప్రముఖులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పిడుగుపాటు బాధిత కుటుంబానికి వితరణ



**ప్రజాపక్షం/కల్లూరుః** పిడుగుపాటుకు గురై వ్యవసాయ ఎద్దు మరణంతో బాధిత వ్యవసాయ పేద కుటుంబానికి చెందిన వినుకొండ దానియేలు కు పెద్ద కోరుకొండి అంబేద్కర్ యూత్ విరాళాలతో రూ. 21 వేలు రూపాయలతో ప్రముఖ వైద్యులు వేము గంగరాజు చేతుల మీదుగా మంగళవారం రాత్రి బాధిత పేద రైతుకు వినుకొండ దానియేలు కుటుంబానికి నగదు రూపాన అందజేశారు. పేద వ్యవసాయ రైతు కు చెందిన గత నెలలో పిడుగుపాటుకు ఎద్దు చనిపోవడం వల్ల నిరాశ దీనత్వంతో ఉన్న వ్యక్తిని ఆదుకునేందుకు కల్లూరు మండలం పెద్ద కోరుకొండి, అంబేద్కర్ యూత్ సహకారంతో విరాళాలను వసూలు చేసి ఆ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ సభ్యులు వేము రామకృష్ణ, వాడపల్లి పుల్లారావు, వేము నాగరాజు, అడిపి కట్ల నాగరాజు ( డోమినిక్), రాజేష్, బీరవల్లి వెంకటేశ్వర్లు, ఎర్నం రాజు, అంబేద్కర్ యూత్ సభ్యులను వేము గంగరాజు గ్రామస్తులు అభినందించారు.

# పూల రహదారి



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని కల్లూరు వెళ్లే రహదారిలో చెన్నూరు నుంచి దారుక బంజర వరకు ఉన్న సుమారు పది కిలోమీటర్ల వరకు ఇరువైపులా ఉన్న హరితహారం చెట్లు అక్కడక్కడ మధ్యలో పూలు పూసి ఎర్రని రంగులో ఉన్న చెట్లు కు ఎర్ర పూలు పూసి ఉండడంతో రహదారి ఇరువైపులా రాకపోకలు చేస్తున్న ప్రయాణికులకు సుందరంగా ఆహ్లాదకరంగా మారింది. మండల పరిధిలోని కల్లూరు నుంచి మధిర వెళుతున్న రహదారిలో చెన్నూరు నుంచి దారుక బంజర వరకు ఇరువైపులా కొన్న రహదారి వెంబడి ఎర్రని పూలతో ఉండటంతో రహదారి ఆహ్లాదకరంగా మారింది. దీనికి తోడు పువ్వుల ప్రియులు నూతన దంపతులు చెట్ల కింద ఉంటూ సెల్ఫీ ఫోటోలు తీసుకుంటున్నారు. మండల పరిధిలోని చెన్నూరు ,పెద్ద కోరుకొండి, పోచవరం, తాళ్లూరు వెంకటాపురం, లింగాల, మర్లపాడు, దారుక బంజర్ తదితర గ్రామాల వారు ఆ రహదారిలో రాకపోకలు చేస్తున్న ప్రయాణికులు, బాటసారులు, వాహనదారులు సెల్ఫీ ఫోటోలతో ఆహ్లాదకరంగా సుందరంగా రాకపోకలు కొనసాగిస్తున్నారు. చూడటానికి అందంగా ఎర్రగా ఉండటంతో మహిళలు సెల్ఫీ ఫోటోలకు ప్రాధాన్యతనిస్తున్నారు.

## బడులను అంగరంగ వైభవంగా ప్రారంభించండి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ప్రభుత్వ పాఠశాలలను బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభించాలని నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బి.రాములు సూచించారు. మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు... మండలంలోని ప్రభుత్వ బడులను పున ప్రారంభం సందర్భంగా అంగరంగ పండుగ వాతావరణంలో ప్రారంభించాలని సూచించారు. ప్రారంభం రోజునే ఏకరూప దుస్తులు, పుస్తకాలను అందించాలని సూచించారు. పాఠశాలలను అందంగా తయారు చేయాలని అన్నారు. ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలను అహ్వానించి ప్రభుత్వ బడుల ఉద్దేశ్యం ను తెలియజేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను శర వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బడి బాట కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

## హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్ పంపిణీ



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో డిగ్రీ చదువుతున్న యేగినాటి హరిక కు ల్యాప్‌టాప్ పంపిణీ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ ఖమ్మం సభ్యులు మద్దినేని ప్రసాదరావు, కమల ఆర్థిక సౌజన్యంతో డిగ్రీ చదువుతున్న యేగినాటి హరికకు రూ. 40వేల విలువ గల ల్యాప్‌టాప్‌ను జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. మద్దినేని ప్రసాదరావు 80 ఏళ్ల పూర్తి చేసుకుని 81వ సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా హరిక అవసరాన్ని గుర్తించి ల్యాప్‌టాప్‌ను అందజేయడం అభినందనీయమని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాదరావు, కమల దంపతులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. హరిక బాగా చదువుకుని అభివృద్ధి లోకి రావాలని కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ బాధ్యులు కొంగర పురుషోత్తమరావు, రాయల నర్సింహారావు, యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి), మద్దినేని రవి, సీనియర్ జర్నలిస్టు యేగినాటి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## పత్తి సాగుపై రైతులకు అవగాహన



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : అధిక సాంద్రత లో పత్తి సాగు, విత్తన ఎంపికలో తీసుకోవాల్సి న జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం రఘునాథపాలెం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం గ్రామంలోని రైతు వేదికలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రైతులకు అధిక సాంద్రతలో పత్తి సాగు, విత్తన ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిహెచ్‌ఎస్‌వో రమణ, ఏడిఏ లు సరిత, శ్రీనివాసరావు, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షులు నల్లమల వెంకటేశ్వరరావు లు మాట్లాడుతూ సాగు మేళకువలు, నూతన వంగడాల వివరాలు, అధిక దిగుబడులు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి డివిజన్ పరిధిలో రైతు వేదికలో ప్రతి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి యరగర్ల హన్మంతరావు, ఏవో లు భాస్కర్‌రావు, కిషోర్, ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, కామేపల్లి మండలాల రైతులు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులు ఆలోచించి ఓటేయండి

ప్రజాపక్షం/ అశ్వారావుపేట : త్వరలో జరుగబోయే జిల్లా ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో ఆలోచించి అభివృద్ధి చేసే వారికి ఓటు వేసి ఆదరించాలని పోటీ అభ్యర్థి దారా రమేష్ కోరారు. మంగళవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ ఆదివారం జరిగే జిల్లా ఎన్నికల్లో పాల్గొనాలని ఆర్యవైశ్యులకు పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు జల్లిపల్లి గుప్తా, గుడివాడ కృష్ణ, కొణిజర్ల ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

## 13న సంత వేలం పాట

ప్రజాపక్షం/ అశ్వారావుపేట: అశ్వారావుపేట మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి బుధవారం జరిగే సంత మార్కెట్‌కు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ ఇఓ హరి కృష్ణ తెలిపారు. ఈ నెల 13న సుజలాం వాటర్ ప్లాంట్ పక్కన సంతలో భాగంగా పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో వేలం జరుగుతుందని తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.10వేలు దారావత్తు సొమ్మును చెల్లించాల్సి ఉంటుందని, వేలం సమయంలో షరతులు వర్తిస్తాయని, ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

# వ్యవసాయంలో యంత్రాలు..!

- కానరాని కాడెడ్లు
- పెరిగిపోతున్న యంత్రాల వినియోగం
- తక్కువ పెట్టుబడి, పనుల్లో వేగం
- యంత్రాలవైపే రైతుల చూపు





ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : వ్యవసాయ పనుల్లో యంత్రాల వాడగం భారీగా పెరిగిపోతోంది. దుక్కులు దున్నింది మొదలుకుని విత్తనాలు నాటేంత వరకు అనంతరం పంట చేతికొచ్చేంత వరకు యంత్రాల వినియోగం అమాంతం పెరిగిపోయింది. యాంత్రీకరణ అందుబాటులో లేని రోజుల్లో వ్యవసా య పనులన్నింటిని కూలీలతో చేయించే వారు. ఉపాధిహామీ పథకం పుణ్యామా అని పల్లెల్లో కూలీల కొరత స్పష్టంగా కనిపించడంతో పాటు కూలీ రేట్లు కూడా పెరిగిపోయాయి. దీంతో చేసేది లేక రైతులు యంత్రాలతోనే వ్యవసాయ పనులు కానిస్తున్నారు. వేసవి దుక్కుల నుండి ప్రారంభమయ్యే యాంత్రీకరణ విత్తనాలు వేసి, చేతిందని పంటలను కోసి మార్కెట్‌కు చేర్చేంత వరకు యంత్రాలతోనే చెలిమి చేస్తున్నారు. ప్రభుత్వాలు వ్యవసాయ యంత్రాలపై సబ్సిడీలు ఇవ్వడంతో సామాన్య రైతులు మొదలుకుని మధ్య తరగతి వారు వరకు కొనుగోళ్లు చేస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులే లక్ష్యంగా రైతులు యంత్రాలను నమ్ముకుంటున్నారు.

**పెరిగిన హార్వెస్టర్ వినియోగం...**

పంటలు కోసేందుకు కూలీల కొరత రావడంతో హార్వెస్టర్ల వినియోగం పెద్ద ఎత్తున పెరిగిపోయింది. పంటలు ఒకే సారి చేతికొచ్చే రోజుల్లో కూలీల కొరత మరింత ఇబ్బంది పెట్టేది. ప్రస్తుతం అన్ని రకాల వ్యవసాయ యంత్రాలు అందుబాటులోనికి రావడంతో పనుల్లో వేగం పెరిగింది. కూలీలు వారం రోజుల పాటు చేసే పని యంత్రం సహాయంతో ఒక్క రోజులోనే కానిచ్చేస్తున్నారు. దీంతో కూలీ భారం కూడా తగ్గనుండటంతో అంతా యంత్రాలపైనే ఆధారపడుతున్నారు.

**కానరాని కాడెడ్లు ...**

కాడెడ్లు పల్లెల్లో కూడా కనిపించే పరిస్థితి లేదు. గతంలో పల్లెల్లోని ప్రతీ రైతు ఇంటి ముందు కాడేద్దులు, నాగళ్లు, ఎడ్ల బండ్లు దర్శనమిచ్చేవి. ఇప్పుడు ట్రాక్టర్ల రాకతో కాడెడ్లు కనుమరుగవుతున్నాయి. గతంలో వ్యవసాయం అంటే కాడెడ్లు, నాగళ్లతో మొదలయ్యేది. కరీఫ్,రబీ సీజన్లలో తెల్లవారుజామున లేచి నాగలి కట్టుకుని పొలంలోక్లి దున్నే వారు. ఇప్పుడు ట్రాక్టర్ సహాయంతో తక్కువ సమయంలో దుక్కులు దున్నుతున్నారు. ప్రస్తుతం ఎకరా దుక్కి దున్నెందుకు రూ.600 నుండి రూ.800 వరకు చెల్లిస్తున్నారు. అదే భూమి చదును చేసే రోటేవేటర్ కోసం కోసం రూ.1000 నుండి రూ1200 వరకు వెచ్చిస్తున్నారు.

# మసకబారుతున్న ప్రభుత్వ విద్య

-మౌలిక సదుపాయాలు కల్పించాలి

-ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన ఏఐఎస్ఎఫ్ బృందం





ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రభుత్వ విద్య మసకబారుతుందని ఒకప్పుడు వందలాది మంది విద్యార్థులతో వెలుగు వెలిగిన ప్రభుత్వ పాఠశాలలు నేడు వెలవెలబోతున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ ప్రతినిధి బృందం ఖమ్మం నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వ విద్య నిర్వీర్యమైతే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులకు నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఆర్భాటంగా ఫ్లెక్సీలు పెట్టి ఫోటోలు దిగి బడిబాట ప్రచారం నిర్వహిస్తే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు రారని రామకృష్ణ తెలిపారు. గత పదేళ్లుగా ఉపాధ్యాయుల నియమాకం లేకపోవడం, ప్రైవేటు విద్యా సంస్థలను నియంత్రించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించి ఉపాధ్యాయ నియమాకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అవలంభించిన విద్యా వ్యతిరేక విధానాలను ఇప్పటి ప్రభుత్వం కూడా అనుసరిస్తుందన్నారు. కొత్త ప్రభుత్వం కొలువు దీరి ఆరు నెలలు దాటినా ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిసారించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రామకృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శివ, వంశీ, హరికృష్ణ, బాలాజీ, మనోజ్, అయ్యప్ప, ప్రసాద్, నవీన్, సాయి, నరేష్, గోపి, ప్రతాప్, వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించండి



ప్రజాపక్షం/ మధిర : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటం జరుగుతుందని మడుపల్లి జెడ్పి హెచ్ఎస్ హెచ్ఎం తోట నర్సింహారావు అన్నారు. మంగళవారం జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. 6వ తరగతిలో చేరే విద్యార్థులను కలిసి పాఠశాలకు ఆహ్వానించారు. 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు విద్యాసంవత్సరం ప్రారంభం నాటికే ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బూసా కోటేశ్వరరావు, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ కె.నాగమణి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు ముగిసే.. పదవులు మిగిలే...!

-మార్కెట్ కమిటీ పాలకవర్గం కోసం పావులు

-సీడీసీ చైర్మన్ పదవి మంత్రి ఆశీస్సులు ఎవరికో..

-కనీసం డైరెక్టర్లకు దక్కినా చాలంటున్న నేతలు



ప్రజాపక్షం-నేలకొండపల్లి : శాసనసభ, లోకసభ, ఎమ్మెల్సీ ఎన్నికలు సందడి పూర్తైయింది. ఎన్నికల కోడ్ కూడ ముగిసింది. ఇంకా మిగిలింది. నామినేటేడ్ పోస్టుల భర్తీ మాత్రమే. అందులో భాగంగానే ప్రభుత్వం కూడ కసరత్తు ప్రారంభించింది. జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటి పాలకవర్గాల పోస్టుల కోసం అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు పదవులు దక్కించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ముఖ్యంగా పాలేరు నియోజకవర్గంలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి పాలకవర్గం కు గట్టి పోటీ ఉంది. మార్కెట్ కమిటి నేలకొండపల్లి, ముదిగొండ, కూసుమంచి మండలాల విస్తీరణం ఉండటంతో మూడు మండలాలకు చెందిన నాయకులను పాలకవర్గంలో కూర్పు చేయాల్సి ఉంది. మార్కెట్ కమిటి చైర్మన్ పదవి కోసం మూడు మండలాల కు చెందిన నాయకులు ఆశావాహులు సంఖ్య భారీగా ఉంది. కానీ రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశీస్సులు ఎవరికి అందుతాయోనని టెన్షన్ నెలకొంది.

**బీసీ నేతల కు కేటాయింపు....**

పాలేరు నియోజకవర్గంలో నేలకొండపల్లి, కూసుమంచి, ముదిగొండ మండలాలకు చెందిన నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి పాలకవర్గం ను బీసీ కి రిజర్వేషన్ కేటాయించటంతో మూడు మండలాలకు చెందిన బీసీ సంఘం నేతలు పోటీలు పడుతున్నారు. నేలకొండపల్లి మండలం కు చెందిన మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ వెనికె జానకిరామయ్య, మాజీ ఎంపీటీసీ వెన్నపూసల సీతారాములు, నేలకొండపల్లి మత్స్య సోసైటీ అధ్యక్షుడు మైశా శంకర్, బోదులబండ ఎంపీటీసీ కట్టెకోల సుధాకర్ లతో పాటు మరో డజను మంది పోటీలో ఉన్నారు. కూసుమంచి మండలం లోని మాజీ ఎంపీపీ, మాజీ సీడీసీ చైర్మన్ జూకూరి గోపాలరావు కూడ రంగంలో ఉన్నట్లు తెలుస్తుంది. ఇది ఇలా ఉండగా...చైర్మన్ రాకపోయిన చివరకు డైరెక్టర్ పదవులు వచ్చినా చాలు అని ద్వితీయ శ్రేణి నాయకులు ఆశతో ఉన్నారు. నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్, సీడీసీ పాలకవర్గాలకు గట్టి పోటీ మాత్రం ఉంది.

**సీడీసీ చైర్మన్ ఎవరికో...**

నేలకొండపల్లి చెరుకు అభివృద్ధి మండలి (సీ.డీ.సీ) చైర్మన్ గిరి కోసం అనేక మంది పోటీ పడుతున్నారు. మంత్రి ప్రధాన అనుచరుడు బోదులబండ కు చెందిన కోడాలి గోవిందరావు తో పాటు చెరుకు రైతులు, కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ మండలాలకు చెందిన అధికార పార్టీ నాయకులు ముందు వరసలో ఉన్నారు. గత పాలకవర్గం నేలకొండపల్లి మండలం కు చెందిన వారికి గత ప్రభుత్వం ఇవ్వటంతో, ప్రస్తుతం కూసుమంచి మండలం కు చెందిన నాయకులకు ఇవ్వవచ్చునని భావిస్తున్నారు. అంతే కాకుండా మార్కెట్ కమిటి చైర్మన్ నేలకొండపల్లి మండలానికి ఇస్తే...సీడీసీ కూసుమంచి లేదా సీడీసీ నేలకొండపల్లి కి ఇస్తే, మార్కెట్ కూసుమంచి మండలానికి ఇవ్వాల్సి ఉంటుంది. మొత్తం మీద నామినేటేడ్ పదవులు కోసం నాయకులు ఆరాటపడుతున్నారు. ఈ పదవులు ఎవరిని వరిస్తాయో మంత్రి శ్రీనివాసరెడ్డి చూపు ఎవరి వైపు ఉందో....వేచి చూడాల్సి ఉంది.

**దేవాలయాల కమిటిలు అదే పరిస్థితి...**

నేలకొండపల్లి మండల కేంద్రంలో శ్రీ ఉత్తరేశ్వరస్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ భీమేశ్వరస్వామి, శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయాల పాలకవర్గాల కమిటి పెద్ద తలనొప్పిగా మారింది. నేలకొండపల్లి లోని పార్టీలో పలు వర్గాలు ఉండటంతో వీరిలో సమన్వయం లేక ఏకాభిప్రాయం రాలేకపోతున్నారు. ఎవరికి వారే పంతం పట్టటంతో దేవాలయం కమిటీలు ఎవరిని ఎంపిక చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ నాయకులు కమిటి ఎంపిక కోసం నిర్వహించిన సమావేశం రసాభసా గా మారింది. మొత్తం మీద కమిటిల పై కసరత్తు ను ప్రారంభించారు.

# మహిమాన్విత శక్తి గల అమ్మవారిగా కీర్తి

-గుడికి ఈశాన్యం నుండి నిరంతరం పిల్లి వాగు ప్రవాహం

-ఈనెల 18న శ్రీశ్రీశ్రీ కోటెమ్మ అమ్మవారి ఆలయ 18వ వార్షికోత్సవం



ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండలంలో గల నరసాపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీశ్రీశ్రీ కోటెమ్మ అమ్మవారి ఆలయ 18వ వార్షికోత్సవ పురస్కరించుకొని ఈనెల 13 నుండి జరిగే జాతర మహోత్సవంకు వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఈ మహిమాన్విత శక్తి గల అమ్మవారి ఆలయం దినదినం అభివృద్ధికి గల కారణాలను గ్రామ పెద్దలు ఈవిధంగా చెపుతున్న అమ్మవారి ఆలయం నిర్మాణానికి పూర్వం ఈ ప్రాంతంలో నూటొక్క దేవాలయాలు చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉండేవని వాటి ఆనవాలు ఇప్పటికి మనకు కనిపిస్తాయి అని వారు చెపుతారు. అందుకే ఈ ప్రదేశానికి గుళ్ళవనం అని నేటికి పిలుస్తారు. ఈ ప్రాంతానికి ఆనుకొని ఉన్న ఏతైన గుట్ట ఉంటుందిఈ గుట్టపేరే కోటమ్మ గుట్ట ఈ గుట్టపైన ప్రతి సంవత్సరం కార్తీక మాసం మూడు నెలల జ్యోతి రూపంలో అమ్మవారి గుట్ట చుట్టు తిరుగుతు గుట్ట లోపలగల అమూల్యమైన తన భాండాగారంలను కాపాడుకుంటుందని పూర్వీకులు చెప్పేవారు. సాక్షాతు అమ్మవారే అందరికీ కనిపించడంతో గ్రామస్తులు ఈ ఆలయాన్ని నిర్మించారించి ప్రతి సంవత్సరం అమ్మవారికి విశేషపూజలు నిర్వహిస్తారు. ఈ ఆలయానికి ఉన్న మరో విశిష్టత ఆలయానికి దక్షిణ దిక్కు నుండి ఉత్తరంగా గుడికి ఈశాన్యం నుండి నిరంతరం పిల్లి వాగు ప్రవాహం ఉంటుంది. అదే విధంగా కాశీలో గంగానది ప్రవహిస్తుందని పురోహితులకు చెపుతారు. అందుకే ప్రతి సంవత్సరం విశేష పూజలు నిర్వహిస్తారు.

# హైస్కూల్‌లో భారీ వృక్షాల నరికివేత

ప్రజాపక్షం/చంద్రుగొండ:నీడ కోసం చెట్లను పెంచాలని మెరుగైనా జీవితం గడపాలంటే మొక్కలు నాటాలని ప్రపంచం మొత్తం స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు చెబుతుంటే మరో ప్రక్క అని తెలిసిన వారే నీడనిచ్చే చెట్లను నరికివేస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే చంద్రుగొండ మండలంలోని మద్దుకూరు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు దశబ్దాలకు పైగా వయస్సున భారీ వృక్షాలను మంగళవారం నరికివేశారు. గ్రామస్తులు చూస్తుండగా నేలమట్టం చేశారు. చెట్ల వేర్లు వల్ల పాఠశాల భవనాలకు ఇబ్బందులు కలుగుతున్నాయనే సాకుతో చెట్లను నేలమట్టం చేశారు. కనీసం ఉన్నతాధికారులు, అటవీశాఖ, గ్రామ పంచాయితీ అనుమతులు తీసుకోవాల్సి ఉండగా అటువంటి అనుమతులు లేకుండా రెండు దశబ్దాల చెట్లను నరికేశారు. ఇలా చెట్లను నరక వద్దు..చెట్లను నాటి రక్షించాలని చెప్పే వారే చెట్లను నరికివేయడం సరి కాదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.




## వర్షాకాలం పంటలపై అవగాహన

ప్రజాపక్షం/బూర్గంపాడు:



మండల కేంద్రంలో రైతు వేదిక నందు రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేతలచే రైతు నేస్తం పేరుతో అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా బూర్గంపాడు రైతు వేదిక నందు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సోదరుల సలహాలు సూచనలు దృశ్య మాధ్యమం ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాబోవు వానాకాలంలో వరి, వ్యవసాయ అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు, సేంద్రియ వ్యవసాయంపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయ పరిశోధకులచే రైతులకు నేరుగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏడిఏ తాతారావు, మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్ శంకర్, ఏఈవోలో జెవిడి ప్రసాద్, రవితేజరెడ్డి, నాగవైష్ణవి, ఏడు మండలాల వ్యవసాయశాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలో మౌలిక సదుపాయాలు కల్పించండి

ప్రజాపక్షం/చంద్రుగొండ:



పంచాయితీలో మౌళిక సదుపాయాలు కల్పించాలని జెడ్‌పిటిసి కొణకండ్ల వెంకటరెడ్డి అధికారులను కోరారు. మంగళవారం పంచాయితీలో కార్యాలయంలో జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గ్రామంలోని అన్ని వీధుల్లో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని, వీధి లైట్లు లేని చోట్ల అమర్చాలన్నారు. ప్రస్తుతం వానకాలంలో మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. వీధుల్లో పారిశుద్ధ్యం పనులు ప్రతి రోజు జరిగేలా చూడాలన్నారు. అవసరం ఉన్న చోట బ్లీచింగ్ చల్లించాలని, మండల కేంద్రంలో కావడం వల్ల సామూహిక మరుగుదొడ్లను నిర్మించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంచాలన్నారు. సభలో పంచాయితీ ప్రత్యేక అధికారి అశోక్, జిపి సెక్రటరీ ఉపేందర్, ఎంపిటిసి దారా వెంకటేశ్వరరావు, అన్ని శాఖల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో వెయ్యండి

ప్రజాపక్షం/ములకలపల్లి: వానా కాలం వచ్చిందని రైతుల పంట పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో వెయ్యాలని జెడ్‌పిటిసి సున్నం నాగమణి డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని మాదారం గ్రామంలో గల తన నివాసంలో సున్నం నాగమణి మాట్లాడుతూ వానాకాలం వచ్చిందని, రైతులు పొలాల్లో దుక్కులను చేస్తూ సిద్ధంగా ఉన్నారని ప్రభుతవం ప్రకటించిన పెట్టుబడి సాయం ఎకరాలకు రూ 7,500లు (ఏటా రూ 15వేలు) రైతుల ఖాతాల్లో వెయ్యాలన్నారు. పంట సాగు కంటే ముందే ఏటా ఎకరానికి ఇస్తామన్న రైతు భరోసా డబ్బుల రూ 15వేలన వెంటనే రైతుల తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతులు పచ్చిరొట్ట, జిలుగు, జనుము విత్తనాలు సరఫరా చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల పంటలకు రూ 500 బోనస్ ఇవ్వాలని తెలిపారు.

## నీట్ యుజీ 2024ను రద్దు చేయాలి

-ఎన్‌టిఏ అధికారులపై చర్యలు తీసుకోవాలి

-పిడిఎస్‌యు ఆధ్వర్యంలో నిరసన




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : నీట్ యుజీ 2024 ను రద్దు చేసి అవకతవకలు, పేపర్ లీకేజీకి పాల్పడిన ఎన్‌టిఏ అధికారులపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మంగళవారం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో డాక్టర్ అకాడమీ నుండి గట్టయ్య సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమం తెలిపారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్. క్రాంతి, జి. మస్తాన్ లు మాట్లాడుతూ నీట్ 2024 ఫలితాలలో ఎన్‌టిఏ అవకతవకలకు పాల్పడి ఉజ్వల భవిష్యత్తు ఉన్న విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిందన్నారు. జాతీయ స్థాయిలో నెంబర్ వన్ ర్యాంక్ 68 మందికి రావడం అదేవిధంగా ఒకే సెంటర్‌లో పరీక్ష రాసిన ఎనిమిది మంది విద్యార్థులు ఉండడం అనుమానానికి తావిస్తుందన్నారు. దీనితో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని కొంత మంది ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నీట్ పరీక్షను రద్దు చేసి మరల నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉదయ్, రామకృష్ణ, శ్రీకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మరణించి ఆరునెలలైనా పెన్షన్‌లు..!


(ఫైల్)

-అనేకమందికి రెండు రకాల పెన్షన్లు
-పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం
-వృధా అవుతున్న ప్రభుత్వ ధనం
-పట్టించుకునే నాథుడే లేకపాయే..


(ఫైల్)

**ప్రజాపక్షం/కూసుమంచి :** మండలంలోని 41 గ్రామపంచాయతీలు 64 శివార్లు 60 వేల 120. 60120 జనాభా కలిగి 17 ప్రాదేశిక నియోజకవర్గ లతో నిర్వహించబడుతున్న కూసుమంచి మండల పరిషత్ ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యంతో గత ఆరు నెలలుగా చనిపోయిన వారికి పెన్షన్లు రావడం వారి నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారిందని చెప్పటంలో ఎటువంటి సందేహం లేదు. ఇప్పటివరకు కూసుమంచి మండలంలో పెన్షన్లు పొందుతున్న వారిలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, కల్లుగీత, హెచ్ఐవి, బోదకాలు, చేనేత, మొదలైన వారు మండలంలో సుమారు 10000 పదివేల మంది ప్రభుత్వ పెన్షన్ పొందుతున్నారు. పెన్షన్ పొందుతూ గత ఆరు నెలల క్రితం చనిపోయిన వారికి కూడా పెన్షన్ రావడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఇంకా అనేకమందికి పదుల సంఖ్యలో డబల్ పెన్షన్లు గత ఎనిమిది నెలలుగా పొందటం గమనర్హం గా ఉన్నది. ఇటీవల కాలంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది కి అనుమానం వచ్చి కొన్ని పెన్షన్లు పరిశీలించగా కొందరికి డబల్ పెన్షన్ రావడంతో వారిని గుర్తించి బ్యాంకు స్టేట్మెంట్ తీసుకొని ఏదో ఒక పెన్షన్ పొందాలని అధికారులు సూచించడంతో పెన్షన్ దారులు ఒకే పెన్షన్ ఎంచుకోవడం జరిగింది. ఇంకా వెలుగులోకి రాని అనేక గ్రామాల్లో గత ఆరు నెలలుగా మరణించిన వారికి పెన్షన్లు రావడం అధికారులను బెంబేలెత్తిస్తున్నాయి.

**పలువురు పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం...**

మండలంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన చనిపోయిన వారికి పెన్షన్లు రావడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. చనిపోయిన వ్యక్తులను గుర్తించి వారికి పెన్షన్ వస్తుందా లేదా అనే విషయాలపై దృష్టి లేక వదిలేయడం వల్లనే నెలల తరబడి చనిపోయిన వారికి పెన్షన్లు రావడం ఈ పెన్షన్లు లబ్ధిదారుల బంధువులు నామినిలు వెంటనే బ్యాంకులో నుంచి డ్రా చేయడం సంబంధిత అధికారులకు తెలియపరచకపోవడం వలన రికవరీ చేయడానికి కూడా అవకాశం లేకుండా పోతున్నది డెత్ సర్టిఫికెట్లు అందించడంలో పంచాయతీ కార్యదర్శులు అనేక గ్రామాల్లో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి ఇంకా పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శి లు జనన మరణ రిజిస్టర్లను సమర్థవంతంగా నిర్వహించకపోవడం వల్లనే చనిపోయిన వారికి పెన్షన్లు వస్తున్నాయని విమర్శ తీవ్రంగా వినిపిస్తోంది.

**ప్రభుత్వ ధనం వృధా పట్టించుకునే వారే లేరు**

చనిపోయిన వారికి పెన్షన్లు రావడం లబ్ధిదారుల బంధువులు బ్యాంకులో నుంచి డబ్బు వెంటనే తీసుకోవడం లక్షలాది రూపాయల ప్రభుత్వ ధనము వృధా అయిపోతున్న ఆరు నెలల నుంచి జరుగుతున్న ఈ తతంగాన్ని ఉన్నత స్థాయి అధికారులు గుర్తించకపోవడం వల్ల ప్రభుత్వ ధనం వృధా అవుతుంది అన్న విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి ఇప్పటికైనా జిల్లా స్థాయి ఉన్నత స్థాయి అధికారులు చనిపోయిన వారి పెన్షన్లను గుర్తించి నిలుపుదల చేసి వృధా దనాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆళ్లపాడులో ప్రబలుతున్న అతిసార

**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని ఆళ్ళపాడు గ్రామంలో అతిసార ప్రబలుతోంది. పలువురు వాంతులు, విరేచనాలతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. గత రెండు రోజులుగా గ్రామంలో పలువురికి ప్రధానంగా పిల్లలు, వృద్ధులు ఎక్కువగా అతిసార బారిన పడుతున్నారు. మంద లక్ష్మి తిరుపతమ్మ అనే మహిళకు వాంతులు, విరేచనాలు అవుతుండటంతో ఆమెను మధిరలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం తిరుపతమ్మ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన బెజవాడ పుల్లయ్య కుటుంబంలో ఇద్దరు పిల్లలకు, మలాది శ్రీను ఇంటిలో ఇద్దరు పిల్లలకు అతిసార వ్యాధి బారిన పడ్డారు. గ్రామంలో అనేక మంది ఈ వ్యాధి బారిన పడి ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. గ్రామంలోని మిషన్ భగీరథ నీరు కలుషితమవడంతోనే గ్రామస్థులు వాంతులు, విరేచనాలు బారినపడి అనారోగ్యం పాలవుతున్నారని పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి జొన్న



లగడ్డ పరుశురాంను వివరణ కోరగా ఆ విషయం తన దృష్టికి రాలేదని అన్నారు. తాను ప్రస్తుతం మిషన్ భగీరథ పనుల్లో ఉన్నానని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో అతిసార వ్యాపించకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# పలకరింపులు.. యోగక్షేమాలు...

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఎప్పుడో 23 ఏళ్ల కిందట చదువుకున్న రోజులు గుర్తుకు తెచ్చుకుని తరగతి గదుల్లో జరిగిన ఘటనలను ఒకరికొకరు మననం చేసుకుంటూ పూర్వ విద్యార్థులు ఎంతో సందడి సందడిగా గడిపారు. ఆనాటి అల్లరి చిల్లర చేష్టలు నేడు పెరిగిన బాధ్యతలు పోల్చి చూసుకుని ఔరా అప్పుడు అలా ఉన్నామా అంటూ ఆశ్చర్యపోయారు. పాలడుగు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసుకున్న 23 ఏళ్ల కిందటి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం వైరా మండల పరిధిలోని పులిగొండ లక్ష్మి నర్సింహా స్వామి దేవస్థానం వద్ద జరిగింది. రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్న విద్యార్థులు పలకరింపులు, ప్రస్తుత జీవన స్థితిగతులు, చేరిన ఉన్నత శిఖరాలను పంచుకున్నారు. గురువులను గుర్తు చేసుకున్నారు. తమతో చదివి దివికేగిన సహచరులకు నివాళులర్పించారు. మొత్తంగా ఒక రోజంతా ఎంతో ఆత్మీయంగా గడిపారు. ఒకరికొకరు జ్ఞాపికలను అందించుకుని మురిసిపోయారు. గద్దల లక్ష్మాద్రి అధ్యక్షతన జరిగిన ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మోదుగు వినోద్‌కుమార్, నాగేశ్వరరావు, ఫర్వీన్, ఏనుగు శ్రీవాణి, ఏనుగు కృష్ణవేణి, తోట నర్సింహారావు, వెంకట్రావు, రవి, శైలజ, కుష్మావతి, కవిత, తెనాలి నర్సింహారావు, కిరణ్, నాగమణి, మజిద్, సురేష్, లక్ష్మి , కృష్ణయ్య, కృష్ణవేణి, అలిమా తదితరులు పాల్గొన్నారు.

**సందడిగా ఆత్మీయ సమ్మేళనం**



# పూర్వ విద్యార్థులకు ఘన సన్మానం





**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని భరత్ విద్యాసంస్థలకు చెందిన పూర్వ విద్యార్థులు జల్లా పూజిత, రేగళ్ళ సాయి, కౌశిక్‌రెడ్డి, సిహెచ్. సాయికుష్మితలను విద్యాసంస్థల అధినేత భరత్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల విడుదలైన జెఇఇ మెయిన్స్ అడ్వాన్స్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశంలో ప్రతిష్టాత్మకమైన క్యాంపస్‌ల్లో సీట్లు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ మునుముందు కూడా జీవితాల్లో అత్యున్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌డియు జిల్లా నాయకులు బ్రహ్మారెడ్డి, విశ్వనాథం, సంగారావు, ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, రవీందర్‌రెడ్డి, శశికళ,నాగరాజు, భవాని, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో చోరీ

**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధిలోని నిధానపురం గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో చేరీ జరిగిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తలుపులకు వేసిన తాళాన్ని పగులకొట్టి అమ్మవారి వెండి వడ్డాణం, వెండి నేత్రాలు, రెండు ఇత్తడి గంటలు హుండీలోని సొమ్మును చోరీ చేశారని ఆలయ పూజారి తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

**ప్రజాపక్షం/ తల్లాడ :** ప్రస్తుత వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తల్లాడ మండల వైద్యాధికారి తెలిపారు. మంగళవారం తల్లాడ మండలంలోని వివిధ గ్రామాలోల డి వాటరింగ్, శానిటేషన్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండాచూసుకోవాలని, నీటి తొట్టెలు, కొబ్బరి బొండాలు, పాత జాడీలు,సీసాలు, టైర్లు తదితర వాటిలో నీరు లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు మోహన్, పెద్ద పుల్లయ్య, భద్రయ్య, వసంతకుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రేరణ కాంపిటేషన్ రాష్ట్రస్థాయికి గురుకుల విద్యార్థిని ఎంపిక

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నేలకొండపల్లి మండలం లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. 9 వ తరగతి చదువుతున్న కె.గ్రేషిత అనే విద్యార్థిని ప్రేరణ కాంపిటేషన్ లో ఖమ్మం జిల్లా స్థాయి లో ప్రతిభ కనపరిచారు. దీంతో రాష్ట్ర స్థాయి కి ఎంపికైయ్యారు. గుజరాత్ రాష్ట్రం లో జరిగే దేశ స్థాయిలో జరిగే కాంపిటేషన్ కు ఎంపికైనట్లు నేలకొండపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఈ.ప్రమీలా తెలిపారు. అదే విధంగా గురుకుల పాఠశాలలో చదివే 24 మంది విద్యార్థినులు విజ్ఞాన జ్యోతి స్కాలర్‌షిఫ్ కు పథకం కు ఎంపికయ్యారు. గురుకులంలో ఇంటర్ రెండో సంవత్సరం పూర్తి చేసిన యంపీపీ విద్యార్థులు16 మంది, బైపీసీ కి చెందిన 8 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. వీరికి ఒక్కోక్కరికి రూ.12 వేల చొప్పున వారి ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఎంపీపీ మొదటి సంవత్సరం లో రూపశ్రీ 470 మార్కులకు గాను, 466 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఆధ్యాపకులు, ఉపాధ్యాయులు సమన్వయంతో ముందుకు సాగటం వలన సాధ్యమవుతుందని ఆమె తెలిపారు.



# సీతారావమ్మకు పొంగులేటి నివాళి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పరుచూరి మురళికృష్ణ మాతృమూర్తి పరుచూరి సీతారావమ్మ (81) మృతి పట్ల రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె మృతి వార్త తెలిసిన వెంటనే బైపాస్ రోడ్డులోని వారి ఇంటికి వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతారావమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. పొంగులేటి వెంట శాసన సభ్యుడు జారె ఆదినారాయణ, రాష్ట్ర మౌలిక, వసతుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు, కార్పొరేటర్లు దొడ్డా నగేష్, మిక్కిలినేని నరేంద్ర, నాయకులు కొప్పెర ఉపేందర్, గోవిందరావు, బాణాల లక్ష్మ ణ్, ఉమ్మనేని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరాలి




**- అధికారులు సన్వయంతో పనిచేయాలి**
**- మంత్రి పొంగులేటి**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజలం ప్రభుత్వం అని, ప్రజా శ్రేయస్సు, సంక్షేమ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలందరికీ అందేలా అధికారులు కలనికట్టుగా సమన్వయంతో పనిచేసి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల జిల్లా స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఏక కాలంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని ప్రజాపాలన సాగాలని నమ్మకంతో గెలిపించుకున్నారని దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులు, నియోజకవర్గంలోని శాసన సభ్యులను సంప్రదించి ప్రజలకు ఇబ్బంది లేకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇల్లు, త్రాగునీరు, విద్యా, వైద్యం, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కల్వర్టులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఆసరా పింఛన్లు అందేలా చూడాలన్నారు. జిల్లాలోని గ్రామ పంచాయితీల్లో మౌళిక వసతుల కల్పన, రోడ్లు, డ్రైనేజీలు, అంగన్వాడీలు, ప్రభుత్వ పాఠశాలల్లో రిపేర్లు ఉంటే సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.39 వేల కోట్లు ఖర్చుచేసి మిషన్ భగీరథ పనులు చేశారని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతీ గ్రామానికి పరిశుభ్రమైన తాగునీటిని అందించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గిరిజన గ్రామాల్లో నిర్మించే రోడ్లుకు అటవీశాఖ అడ్డంకులను తొలగించుకునేందుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమయ్లను పరిష్కరించి అన్ని గ్రామాల్లో రోడ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. భద్రాచలం, కొత్తగూడెం డివిజన్లలో 30 శాతం కంటే ఎక్కువ నిర్మాణం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలను పూర్తి చేసి పిల్లలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పండుగ తావారణంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులతో పాఠశాలలు ప్రారంభించాలన్నారు. అదే రోజు పిల్లలకు పుస్తకాలు, యూనిఫాంలు, ఇతర మెటీరియల్ అందించాలన్నారు. గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పిల్లలకు తొలివిడత తెలుగులో విద్యాబోధన చేయాలని, రాబోయే రోజుల్లో ఆంగ్లమాధ్యంలో చదువులు చెప్పి కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడానికి రాష్ట్రంలో రూ.650 కోట్లకు పైగా ఖర్చు పెట్టే విధంగా పాఠశాలల నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. ఆ పనులు 80 శాతం వరకు పూర్తయ్యాయని, వారం రోజుల్లో మిగితా పనులు పూర్తయ్యే విధంగా ఆదేశాలు జారీచేసినట్లు చెప్పారు.రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు పాఠశాలలతో పాటు కళాశాలల నిర్మాణాన్ని సైతం చేపట్టినట్లు చెప్పారు. ధరణి ఆన్‌లైన్ ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు తమ దృష్టికి వస్తే తప్పని సరిగా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. పెండింగ్‌లో ఉన్న 2 లక్షల 45 వేల ధరణి దరఖాస్తుల్లో ఎన్నికల కోడ్ రాకముందే లక్ష వరకు పూర్తి చేశామని, మిగతావి వారంలో పరిష్కరిస్తామని చెప్పారు. కొత్తగూడె ం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రథాంగా చేతకొండ, రేగళ్ల, పాల్వంచ లలో వేల ఎకరాల భూముల ఆన్‌లైన్ ప్రక్రియలో సమస్యలు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఎంఎల్‌ఏ, జిల్లా కలెక్టర్ సమన్వయంతో వారం రోజుల్లో పరిష్కరించాలన్నారు. వర్షాకాలంప్రారంభమైనందున మారుమూల గ్రామాల్లో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలనిచెప్పారు. త్రి ఫేస్ విద్యుత్ సదుపాయం లేని ప్రాంతాల్లో సర్వే చేపట్టి ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందేలా చూడాలన్నారు. ఆగస్టు 15వ తేది నాటికి రైతులందరికీ రుణమాఫీ ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, ఎంఎల్‌ఏలు కూనంనేని సాంబశివరావు,పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, డా.తెల్లం వెంకట్రావు, జారె ఆదిన్నారాయణ, మాలోత్ రామ్ దాస్ నాయక్, జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా, ఐటిడిఏ పిఓ ప్రతీక్ జైన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

**బడి బాట కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్**







**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మెరుగైన విద్య బోధనతో పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ ఖమ్మం నగరంలోని రమణగుట్టలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. అధికారులు, ఉపాధ్యాయులు, పిల్లలతో కలిసి విద్యా ప్రాముఖ్యతను వివరిస్తూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని వారి పిల్లలను తప్పనిసరిగా చదివించాలని తెలిపారు. ప్రతి ఒక్క పిల్లవాడు పాఠశాలలో నమోదయ్యే దిశగా బడిబాట కార్యక్రమాన్ని జూన్ ఆరు నుంచి 19 వరకు నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన వసతులు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో వస్తున్న మెరుగైన ఫలితాలను తల్లిదండ్రులకు వివరిస్తూ అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో నమోదయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు కంటే మెరుగైన నాణ్యతా అనుభవం కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువు చెబుతారని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యొక్క సంపూర్ణ అభివృద్ధి పై దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. బట్టి పట్టే విధానం కాకుండా పాఠ్యాంశాలు విద్యార్థులకు అర్థమయ్యే దిశగా వారికి వివరిస్తూ కొత్త బోధనా పద్ధతులను ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందన్నారు. ఇటీవల వచ్చిన పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎటువంటి ఖర్చు లేకుండా నాణ్యమైన విద్య విద్యార్థులకు అందుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి నెల పేరెంట్ మీటింగ్ నిర్వహిస్తున్నామని విద్యార్థుల పురోగతే లక్ష్యంగా ఎప్పటికప్పుడు తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తూ కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలలో విఫలమైన చంద్రయాన్ ప్రయోగాన్ని మన భారత శాస్త్రవేత్తలు విజయవంతం చేశారని అటువంటి శాస్త్రవేత్తలు సైతం ప్రభుత్వ పాఠశాలల్లో చదివారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా విద్యతో పాటు వారికి అవసరమైన యూనిఫాం, పాఠ్య, నోటు పుస్తకాలను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. అనవసరంగా ప్రైవేటు పాఠశాలల్లో చేర్చి డబ్బు వృథా చేసుకోవద్దని ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఐఐటి, నీట్ ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్నారని, క్రీడల్లో సైతం రాణిస్తున్నారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకుని తల్లిదండ్రులు వారి పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అంతకు ముందు కలెక్టర్ ఎన్నెస్పి కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల పనులను తనిఖీ చేశారు. పాఠశాలకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు వచ్చినది అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య, కొత్తగా ఎంత మంది నమోదైంది అడిగి తెలుసుకున్నారు. బడి బాట కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డ్రాప్ అవుట్ అయిన పిల్లలను గుర్తించి తిరిగి చదువుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ, అర్బన్ మండల విద్యాధికారి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు శంకర్ రావు, పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పైప్‌లైన్ తొలగించేందుకు చర్యలు

**-మిల్లు నీటితో కలుషితమయ్యే ప్రాంతాన్ని పరిశీలించిన కమిషనర్**
**-కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు సమాచారం -నోటీసులు జారీ**



**ప్రజాపక్షం/వైరా:** ప్రజల ఆరోగ్యానికి ఆరోగ్యాలతో చెలగాట మాడుతూ పర్యావరణానికి ముప్పు తెచ్చే విధంగా ఎవరికి ఎలాంటి అనుమానం రాకుండా భూమి ద్వారా వైరా రిజర్వాయర్‌లోకి వచ్చే పగిడేరు వాగులోకి ఎస్ఏఆర్ రైస్ ప్రొడక్షన్ నిర్వాహకులు కలుషిత పైప్‌లైన్ వేయడంతో ప్రజాపక్షం దినపత్రికలో ప్రజలతో చెలగాటమాడుతున్న ఎస్ఏఆర్ రైస్ మిల్లు అనే కథనాన్ని ప్రచురించడం జరిగింది. ఈ కథనానికి స్పందించి ప్రజల ఆరోగ్యమే ముఖ్యమంటూ వైరా మున్సిపాల్ కమీషనర్ సిహెచ్.వేణు సోమవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని లాలాపురం సమీపంలో ఉన్న ఎస్ఏఆర్ రైస్ ప్రొడక్ట్ ఇండస్ట్రీ వారు పగిడేరులో వేసిన పైపులను పరిశీలించి మిల్లు నిర్వాహకులు కలుషిత నీరును వైరా ప్రాజెక్ట్‌లోకి వెళ్లే వాగులోకి వదులుతున్నారు అని నిర్ధారించారు. దీంతో ఎస్ఏఆర్ రైస్ ప్రొడక్ట్ ఇండస్ట్రీకి నోటీసులు ఇవ్వడంతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి ప్రజలకు త్రాగునీరు అందించే వైరా రిజర్వాయర్ కలుషితం చేస్తున్నారని నివేదికను అందించడం జరుగుతుందని మున్సిపాలిటీ కమీషనర్ వేణు తెలిపారు. ఎవరికి అనుమానం రాకుండా భూమి లోపల పైపులు వేయడం జరిగిందని, కొతమందిని రైతులను కూడా అడగడం జరిగింది. వారు వాస్తవమే ఈ ఫ్యాక్టరీ ప్రారంభం నుంచే కలుషిత నీరును పగిడేరులోకి వదులుతున్నారని ఆ కలుషిత నీరు రిజర్వాయర్‌లోకి వెళుతుందని చెప్పడం జరిగిందని కమీషనర్ తెలిపారు. అదేవిధంగా ప్రజల ప్రాణాలతో ఆరోగ్యంతో చెలగాటమాడుతూ పర్యావరణానికి ముప్పు తెచ్చే విధంగా ఉన్న ఎస్ఏఆర్ రైస్ మిల్లుపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు భూమి లోపల వేసిన పైప్‌లైన్‌ను తొలగించడం జరుగుతుందని కమీషనర్ వేణు తెలిపారు. మిల్లు నిర్వాహకులకు నోటీసులు పంపించడం జరిగిందని కమీషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ సిబ్బంది, శానిటైజర్ఆఫీసర్ సైదులు, వెంకట్రావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మరాజ్యంలో అన్ని వర్గాల అభివృద్ధి




**ప్రజాపక్షం/వైరా:** ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీఠ వేస్తుందని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. మంగళవారం వైరాలో నాయీబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం మిట్టపల్లి గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తుందని, రాష్ట్రంలో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. జిల్లా మంత్రులతో పాటు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని అన్నారు. నాయీబ్రాహ్మణులకు సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీ పథకాలను వంద రోజుల్లో అమలు చేసి చూపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, శీలం వెంకటనర్సిరెడ్డి, డాక్టర్ కుదురుపాక మోహన్‌రావు, దాసరి దానియేలు, మిట్టపల్లి నాగి, దార్న రాజశేఖర్, దేవరకొండ శ్రీనివాసరావు, కేతవరపు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలను అమలు చేయండి




**ప్రజాపక్షం/వైరా:** సిపిఎం వైరా పట్టణ పార్టీ సభ్యులకు రాజకీయ శిక్షణా తరగతులు స్థానిక మధు విద్యాలయంలో జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన రాజకీయ క్లాసులకు పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు చింతనిప్పు చలపతి రావు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఉదయం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు వర్తమాన రాజకీయాలు బోధించారు. నేడు అధికారం దక్కించుకునే విధంగా దేశ రాజకీయాలు ఉన్నాయని, అధికారం కోసం ప్రజా సమస్యలు గాలికి వదిలేశారని, ఎన్నికల్లో గెలుపు కోసం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. భారత వ్యవసాయం రంగం సంక్షోభంలోకి నెట్టివేయబడుతుందని, వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పెరుగుతున్న వేడి వలన వ్యవసాయ పంటల దిగుబడులు తగ్గిపోతున్నాయని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు చట్టబద్ధత కల్పించాలని అనానరు. మధ్యాహ్నం మతం మతోన్మాదం క్లాసు వైరా స్టడీ సర్కిల్ కన్వీనర్ బోడపట్ల రవీందర్ బోధించారు. బిజెపి ప్భుత్వం ప్రజల మధ్య మత విద్వేషాలను పెంచుతుందని, లౌకిక రాజ్యాంగం స్ఫూర్తిని దెబ్బతీస్తుందని అన్నారు. ఈ క్లాసులో పార్టీ వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, మల్లెంపాటి రామారావు, బొంతు సమత, హరి వెంకటయ్య, అనుమోలు రామారావు, రాచబంటి బత్తిరన్న, సంక్రాంతి నరసయ్య, గుడిమ్లె మోహన్‌రావు, గుమ్మా నర్సింహారావు, శాఖా కార్యదర్శులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.